క్లుప్తంగా

కాలభైరవ స్వామికి ఘనంగా పూజలు


ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని శ్రీ మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవస్థానంలో కాలభైరవ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరవ అష్టమి సందర్భంగా స్వామికి భక్తులు తెచ్చిన పిండి వంటల దండను అలంకరించారు. అలాగే గుమ్మడి కాయలపై నెయ్యి దీపాలతో నైవేద్యం సమర్పించారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, క్షీరాభిషేకరం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపారు. అంతకు ముందు గణపతి మహాస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాల సందర్భంగా దేవస్థానం పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది శివ, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుప్రభాత సేవ


వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ సాంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కనులపండువగా వేంకటేశ్వరుని కల్యాణం


వేంకటేశ్వరుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మద్రిపాలెం: కలియుగదైవం వేంకటేశ్వరుని కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు జీవీఎంసీ 51వ వార్డు అప్పయ్యనగర్‌లో కొలువైన శ్రీ భూసమేత విజయ వేంకటేశ్వరస్వామి ఆలయ 33వ వార్షికోత్సవం మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం రెండో రోజు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవంలో ముఖ్య అతిథిగా వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పీ-4 సర్వేపై గ్రామ సభ

మురళీనగర్: పేదరిక నిర్మూలనలో భాగంగా జీవీఎంసీ 50వ వార్డులో శనివారం ఐదు సచివాలయాల అడ్మిన్ల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ మేరకు పి-4 సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల అట్టడుగున ఉన్న కుటుంబాలను గుర్తించి వారి జాబితా సచివాలయంలో ప్రదర్శిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వార్డు బీజేపీ అధ్యక్షుడు కూన వెంకట్రావు, జనసేన అధ్యక్షుడు సనపల శివసాగర్, బీజేపీ నాయకులు కిల్లి శ్రీరామ్మూర్తి, కె.వి.రమణ, సనపల రామకృష్ణ, రామచంద్రరావు, వై.ధాత్రి, ఎన్.నాగరాజు, పి.శ్రీను, సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలా... ఇలా అయితే ఎలా?

- ★ నిబంధనలు బేఖాతర్
- ★ పరిమితికి మించి విద్యార్థులతో రాకపోకలు
- ★ బస్టాపుల్లో యథేచ్ఛగా పార్కింగ్
- ★ రాంగ్‌రూట్ ప్రయాణాలు
- ★ ట్రాఫిక్ సిగ్నల్స్ జంపింగ్


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పరిమితికి మించి విద్యార్థులతో వెళ్తున్న ఆటోలు




పి అండ్ టి కాలనీలో కిక్కిరిసిన విద్యార్థులతో వెళ్తున్న ఆటో

సీతమ్మధార: ఆటోడ్రైవర్లు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ పోలీసులు పదేపదే హితబోధ చేస్తున్నా ఫలితం లేకపోతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగిసాయి కదా అనుకున్నారో ఏమోగాని ఆటో డ్రైవర్లు ఏడాది పొడుగునా రోడ్డు నిబంధనలు ఉల్లంఘించడమే పనిగా పెట్టుకున్నారంటే అతిశయోక్తి కాదు. ద్వారకా సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆటో వాలాలు చెలరేగిపోతున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడని ఆందోళన వ్యక్తమవుతోంది. నగరంలోని గురుద్వారా జంక్షన్, సీతమ్మపేట, ఆర్టీసీ కాంప్లెక్స్, రేసపువానిపాలెం సీఎంఆర్ సెంట్రల్ బస్‌బే, సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, తహశీల్దార్ కార్యాలయం తదితర ప్రాంతాల్లోని బస్‌షెల్టర్ల వద్ద సిటీ బస్సులు ఆపేందుకు ఆటంకం కలిగించే రీతిలో ఆటోలు దర్జాగా పార్కింగ్ చేయడం గమనార్హం. బస్సులు వచ్చే సమయానికి బస్టాపుల వద్ద రోడ్డుకి అడ్డంగా ఆటోలు ఆపేసి టికెట్ సర్వీసు చేయడం గమనార్హం. ముఖ్యంగా సత్యం జంక్షన్‌కు వెళ్లే గురుద్వారా హైవే బస్టాప్


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్ (ఫైల్‌ఫోటో)

వద్ద ఆటోల కారణంగా బస్సులు బస్టాప్‌కు రాకముందే ఆపేయాల్సిన దుస్థితి నెలకొంటుందని సిటీబస్ ప్రయాణికులు వాపోతున్నారు. సీతమ్మపేటకు వెళ్లే గురుద్వారా బస్టాప్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంటున్నా ట్రాఫిక్ పోలీసులు పత్తా ఉండడం లేదని పలువురు మండిపడుతున్నారు. పైగా పక్కనే ద్వారకా సబ్ కంట్రోల్ ఉన్నా ప్రయోజనం మాత్రం ఉండడం లేదని సిటీబస్ ప్రయాణికులు వాపోతున్నారు.

నిబంధనలు బేఖాతర్..

నగరంలోని బస్టాపుల వద్ద ఆటోలు పార్కింగ్ చేయరాదని ట్రాఫిక్ సీఐలు, ఎస్‌ఐలు తరచూ హెచ్చరిస్తున్నా ఆటోవాలాల తీరు మారితే ఒట్టు. పాఠశాలల ఆటో డ్రైవర్లు ఆరుగురికి మించకుండా తీసుకెళ్లాలని చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా మలుపులు తిరిగే ముందు విధిగా సిగ్నల్ లైట్లు ఆన్ చేయకపోవడం గమనార్హం. ట్రాఫిక్‌లో తోటి వాహన చోదకులతో దురుసుగా ప్రవర్తించడం కూడా తీవ్ర దుమారం రేపుతోంది. రోడ్డు మార్జిన్‌లోనే ప్రయాణాలు సాగించేలా డ్రైవర్లు జాగ్రత్తలు పాటించడం లేదని తోటి వాహన చోదకులు వాపోతున్నారు. ద్వారకా స్టేషన్ పరిధిలో గల బస్టాప్‌ల వద్ద ట్రాఫిక్‌కి ఆటంకం కలిగించేలా ఆటోలు పార్కింగ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. ఆటో డ్రైవర్ సీట్లో ప్రయాణికులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించ రాదని పోలీసులు సూచిస్తున్నారు. ఆటో డ్రైవర్లు విధిగా ఖాకీ యూనిఫాం ధరించాలని నిబంధనలు చెబుతున్నాయి. రాంగ్‌రూట్‌లో రావడం, ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయడం ఆటో వాలాలకు పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఆటోడ్రైవర్ల ఉల్లంఘనల జాబితా చాంతాడంత అవుతుందంటే అతిశయోక్తి కాదు.

ప్రమాదాలు జరుగుతున్నా..

నగరంలో చిన్నా చితకా ప్రమాదాలలో అధికశాతం ఆటోలవే అంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే ఆటోల్లో విద్యార్థులని ఏమాత్రం కనికరం లేకుండా కుక్కేసి మరీ రాకపోకలు సాగిస్తున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని తోటి వాహన చోదకులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. వాస్తవానికి ఆటోల్లో ఆరుగురికి మించి తీసుకెళ్లరాదన్న నిబంధన గాలికి కొట్టుకుపోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. చాలాసార్లు ఆటోడ్రైవర్ల పక్కనే ప్రయాణికులు కూర్చుంటున్నా ట్రాఫిక్ పోలీసులు ఎందుకనో లైట్ తీసుకుంటున్నారు అనిపిస్తుంది.

గంజాయి నిందితుల అరెస్టు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో జరిగిన తనిఖీల్లో రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో శనివారం ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ ఎస్. చిట్టిబాబు, జీఆర్పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి సిబ్బందితో కలిసి వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడుకు చెందిన మహ్మద్ అబ్బాస్ విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా చెన్నైకు అక్రమంగా గంజాయి రవాణా చేయడం గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి రూ. 50 వేల విలువైన 10 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. మరోకేసులో ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఎం.ఎల్. మీనా, జీఆర్పీ ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్ మారుఫ్ నిర్వహించిన తనిఖీల్లో మధ్యప్రదేశ్లోని జబల్పూర్‌కు చెందిన ఆకాష్‌కోరి, పర్వీన్ చౌదరి తెలంగాణకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించారు. వీరి వద్ద నుండి రూ. 70 వేల విలువైన 14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

కొండవాలులో అభివృద్ధి పనులకు భూమిపూజ


డ్రైనేజీ, రక్షణ గోడల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ కామేశ్వరి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి తిక్కవానిపాలెంకాలనీ కొండవాలు ప్రాంతంలో జోన్-5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో అభివృద్ధి పనులకు శనివారం వార్డు కార్పొరేటర్ కామేశ్వరి శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 29 లక్షలతో సీసీ డ్రైనేజీలు, రక్షణ గోడలు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ కోమల, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, కూటమి నాయకులు ఉషాకిరణ్, శ్యామల దీపిక, గుణుపూడి అరుణ్ బాబు, పైడివాడ శ్రీనివాస్, ఉమా మహేశ్వరి, కార్యకర్తలు, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణతోనే జీవుల మనుగడ


పిచ్చుకుల సంరక్షణపై ప్రచారం చేస్తున్న వాకర్స్ క్లబ్ మహిళలు

మురళీనగర్: నీటిని సంరక్షించడం ద్వారానే జీవుల మనుగడ సాధ్యమవుతుందని కాలుష్య నియంత్రణ శాఖ విశ్రాంత అధికారి భాస్కరరావు అన్నారు. ప్రపంచ జల సంరక్షణ దినోత్సవం సందర్భంగా మాధవదార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బిర్లా కూడలి సమీపంలోని గంగా గోదావరి వుడా బహుళ అంతస్తుల సముదాయంలో భూగర్భ జలాల పునరుద్ధరణ, జల సంరక్షణపై క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన శనివారం సాయంత్రం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచ భూతాల్లో ఒకటైన నీటిని దుర్వినియోగం చేయకూడదని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాడుక నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి పంపించి భూతాపాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రతి అపార్టుమెంటు ప్రాంగణంలో వీలైనన్ని ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అంతరించిపోతున్న పక్షులను రక్షించేందుకు మట్టితో చేసిన పిచ్చుక గూళ్లు, నీటి పాత్రలను గ్రీన్ క్లైమేట్ సంస్థ ప్రతినిధి జేవీ రత్నం అందజేశారు. పిచ్చుకల సంరక్షణకు ప్రతి ఇంటి బాల్కనీలో వీటిని పెట్టుకుంటే పిచ్చుకలు వస్తాయన్నారు. ధాన్యం కుచ్చుల తయారీ విధానంపై వనమాలి గ్రూప్ సభ్యురాలు రమాదేవి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి, కార్యదర్శి పి.కమల, కోశాధికారి ఎస్. శేషామణి, ఎడిటర్ డి.శిరీష, ఎం.రాధ, సాయి సుధ, చంద్రిక, నీరజ, నివాసితుల సంఘం సభ్యులు రమణ, రామారావు, ఎరయ్య, రెడ్డి, మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎస్.సాయిలక్ష్మి కుమారి రచించిన 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ ఇన్ హెల్త్ కేర్' పుస్తకాన్ని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి ఒక్కరూ తమ జ్ఞానాన్ని ఇనుమడించుకోవాలని సూచించారు. సాయిలక్ష్మి రచించిన పుస్తకం ఇంటెలిజెన్స్‌పై అవగాహన పెంచుకోవడానికి దోహదపడుతుందని, పుస్తకం రచించిన ప్రొఫెసర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి జె.బాబు, అసిస్టెంట్ విభాగాధిపతి కె.వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

మరిచిపోయిన బ్యాగ్ అప్పగింత

తాటిచెట్లపాలెం: రైల్వే భద్రతా దళం సిబ్బంది రైల్వే స్టేషన్‌లో మరిచిపోయిన ప్రయాణికుడి బ్యాగ్‌ను అతనికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. బి. రాంబాబు అనే ప్రయాణికుడు సింహాచలం రైల్వేస్టేషన్ నుండి బొబ్బిలి వెళ్లేందుకు ఈ నెల 20వ తేదీన బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. రైలోఇకి ప్రవేశించే సమయంలో తన విలువైన ఆభరణాల బ్యాగ్‌ను స్టేషన్‌లోనే మరచిపోయారు. వెంటనే ఫిర్యాదు చేయగా అప్రమత్తమైన ఆర్పీఎఫ్ సిబ్బంది బ్యాగ్‌ను కనిపెట్టి ప్రయాణికుడికి సమాచారం అందజేసి శనివారం మద్రిపాలెం పోస్ట్ వద్ద అందజేశారు. ఆ బ్యాగులో 33 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. మరిచిపోయిన తన బ్యాగును తనకు అప్పగించినందుకు ఆర్పీఎఫ్ సిబ్బందికి ప్రయాణికుడు ధన్యవాదాలు తెలిపారు.

వెండింగ్ బోర్డుల తొలగింపు అన్యాయం


ధర్నా చేస్తున్న తోపుడు బళ్ల కార్మికులు

సీతమ్మధార: మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద, సీఎంఆర్ సెంట్రల్ వద్ద, చిన్న వాల్తేర్ కొటక్ స్కూల్ వద్ద వెండింగ్ బోర్డులు తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ జోన్- 3 జీవీఎంసీ కార్యాలయం వద్ద తోపుడు బండ్ల వ్యాపారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి. వెంకట్రావు మాట్లాడుతూ టీవీసీ కమిటీ ఆమోదంతో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది 2016లో సీఎంఆర్ సెంట్రల్, మద్దిలపాలెం సిటీ కాంప్లెక్స్ రోడ్డు పక్కన వెండింగ్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్ట్రీట్ వెండర్లకు రక్షణ కల్పిస్తూ ఈ బోర్డులు ఏర్పాటు చేశారని అన్నారు. జోన్- 3 కమిషనర్ వీటిని పరిశీలించకుండా తప్పుడు ఫిర్యాదుతో టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బందిని పంపి మద్దిలపాలెం ఆర్టీసీ డిపో, సీఎంఆర్ సెంట్రల్ వద్ద గలబోర్డులు తొలగించడం సరి కాదని అన్నారు. స్ట్రీట్ వెండర్స్ చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించిన జోన్ కమిషనర్‌ను తక్షణం సస్పెండ్ చేసి, తొలగించిన వెండింగ్ బోర్డులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తోపుడు బండ్లు, చిల్లర వర్తకల సంఘం జిల్లా కార్యదర్శి అంగుడు సింహాచలం మాట్లాడుతూ 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్ వద్ద ఉన్న బోర్డులను తొలగించడం సరి కాదన్నారు. సమస్యను ప్రస్తావిస్తూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోన్ నాయకురాలు కె.కుమారి, సీఎంఆర్ సెంట్రల్ నాయకులు చిన్ని, ఎల్లం నాయుడు, శ్రీను, మద్దిలపాలెం ఆర్టీసీ డిపో సెంటర్ నాయకులు వై. సాయి, ఎం. గణేష్, చినవాల్తేర్ సెంటర్ నాయకుడు అప్పారావు, తోపుడు బళ్ల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వారెవ్వా.. హాలీం

విశాఖ ప్రజల నుంచి విశేష స్పందన


హాలీం తింటున్న ఓ కుటుంబం

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు పోర్టు స్టేడియం దరి గ్రీన్‌పార్క్ కాలనీలో హైదరాబాదీ ఇరానీ పిస్తా హాలీం సెంటర్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు నవాజ్ మాట్లాడుతూ ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో హాలీం సెంటర్ ఏర్పాటు చేయడం సంతోషకరం అన్నారు. రంజాన్ మాసం విజయవంతంగా ముగియాలని ఆకాంక్షించారు. నెల రోజుల పాటు రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు హాలీం సెంటర్ తెరిచి ఉంటుందన్నారు. ఇక్కడ చికెన్, మటన్ హాలీం, చికెన్, మటన్ బిర్యానీ అందుబాటులో ఉంటాయి అన్నారు. తొలిరోజే వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. విశాఖ ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, మటన్ బిర్యానీ ఎక్కువగా తీసుకెళ్తున్నారని తెలిపారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీ నుంచి నిపుణులను తీసుకొచ్చినట్లు తెలిపారు.

వాల్తేర్ డివిజన్ పరిధిలో విస్తృత తనిఖీలు


తనిఖీలు చేస్తున్న కమర్షియల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భద్రతా ప్రమాణాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. జన సామర్థ్య నిర్వహణ, టికెట్ లేని ప్రయాణికులకు జరిమానాలు విధించారు. మార్చి 19వ తేదీ నుండి ప్రారంభమైన ఈ ప్రత్యేక తనిఖీల్లో పాల్గొన్న కమర్షియల్ సిబ్బంది ఇప్పటి వరకు టికెట్ లేకుండా, సరైన టికెట్ తీసుకోకుండా ప్రయాణిస్తున్న వారిపై 3368 కేసులు నమోదు చేసి, వారి వద్ద నుండి సుమారు రూ. 17 లక్షలు జరిమానాగా వసూలు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో వాల్తేర్ డివిజన్ కమర్షియల్ సిబ్బంది, రైల్వే భద్రతా దళం సిబ్బంది పాల్గొన్నారు. వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బోరా సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్షయ ఆస్పత్రి సహకారంతో వాకర్స్ పార్కులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు ఉదయం 6.30 గంటల నుంచి 11.30 గంటల వరకు బీపీ, సుగర్, ఆర్థోపెడిక్, గైనిక్ సమస్యలతో పాటు సాధారణ వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ వి.అచ్యుతరామయ్య, డాక్టర్ సంధ్యారాణి పాల్గొంటారని మురళీనగర్, మాధవధార పరిసర ప్రాంత ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయోమయంలో కూటమి ప్రభుత్వం


మాట్లాడుతున్న డాక్టర్ జాన్‌వెస్లీ

సీతంపేట: గత ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఏ విధంగా ఉపయోగించాలో తెలియని అయోమయంలో కూటమి ప్రభుత్వం ఉందని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ విమర్శించారు. లలితానగర్‌లోని తన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. రుషికొండలోని హరిత హిల్ రిసార్ట్ భవనాన్ని ఆధునికీకరించి టూరిజం విభాగం నిర్మించిన ప్రభుత్వ భవనాలను షిష్ మహల్‌గా వర్ణించడం బాధ్యత గల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు తగదన్నారు. విశాఖలో కార్యనిర్వాహక రాజధాని కోసం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేవలం రూ. 487 కోట్లతో ఆధునికీకరించిన టూరిజం డిపార్ట్‌మెంట్ భవనాలను ఎంచుకున్నదని తెలిపారు. కల్లబొల్లి కబుర్లతో ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం తమ సొంత ప్రయోజనాల కోసమే మరల అమరావతి నిర్మాణాన్ని తెరపైకి తెచ్చిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి కూటమి ప్రభుత్వ చర్యల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నారు.

లలితాపీఠంలో చండీ హోమం


హోమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు

సీతంపేట: లలితానగర్‌లోని లలితాపీఠంలో ఫాల్గుణ మాసం, బహుళ అష్టమి సందర్భంగా శనివారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి, చివరగా పూర్ణాహుతి జరిపించారు. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. హోమం వల్ల ఆరోగ్యం, విజయం సిద్ధిస్తుందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు హోమం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి నైపుణ్యమే లక్ష్యం


విద్యార్థులతో ఎంపీ శ్రీభరత్ తదితరులు

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో నైపుణ్యం సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏరోస్పేస్‌లో ఉపాధి అవకాశాలకు సంబంధించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు బోయింగ్ అండ్ లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, ప్రగతి సాధనకు విధి విధానాలు రూపకల్పన చేశామని దీనిలో భాగంగా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక విద్యనభ్యసించే విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు పరిశ్రమల భాగస్వామ్యంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బోయింగ్ సంస్థ ఇస్తున్న శిక్షణ రాష్ట్ర యువతకు ఉద్యోగావకాశాలు పెంచుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బోయింగ్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఏరో స్పేస్ తయారీ రంగంలో 127 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. 2023లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మూడు బ్యాచ్‌లుగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మూడవ బ్యాచ్ విద్యార్థులకు ఎంపీ ఎం.శ్రీభరత్ ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యా శాఖ ప్లేస్‌మెంటు విభాగం డిప్యూటీ డైరెక్టరు డాక్టర్ రామకృష్ణారావు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, ఫ్లూయెంట్ గ్రిడ్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకృష్ణ గన్నమణి, బోయింగ్ సంస్థ సౌత్ ఆసియా చీఫ్ ఆఫ్ స్టాఫ్ అండ్ సీఎస్ఆర్ లీడర్ ప్రవీణ యజ్ఞంభట్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుధా ప్రియదర్శన్, ఆయా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్విగ్గీ డెలివరీ బాయ్‌పై దాడి


ఆక్సిజన్ టవర్స్ వద్ద బాధితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

సీతమ్మధార: స్విగ్గీ డెలివరీ బాయ్‌పై ఆక్సిజన్ టవర్స్‌లో ఒక ఫ్లాట్ యజమాని దాడి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగినప్పటికీ.. బాయ్ కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం టవర్స్ ముందు ధర్నా చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆక్సిజన్ టవర్స్‌లోని 2914 ఫ్లాట్‌లో ఉన్నవాళ్లు స్విగ్గీలో ఫుడ్ ఆర్డర్ పెట్టారు. కొద్ది సేపటి తర్వాత డెలివరీ బాయ్ అనిల్ ఫుడ్ తీసుకుని టవర్స్ ఎంట్రన్స్ సెక్యూరిటీ వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి సెక్యూరిటీ సదరు ఇంటి నంబర్‌కు ఫోన్ చేసి ఫుడ్ వచ్చిన విషయం చెప్పారు. అయితే డెలివరీ బాయ్‌కి, ఇంట్లో మహిళకు వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఫ్లాట్‌కు ఫుడ్ తీసుకెళ్లిన అనిల్‌పై ఆ ఇంటి యజమాని ప్రసాద్ కర్రతో దాడి చేసినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా కొట్టుకుంటూ కిందకు తీసుకొచ్చి సెక్యూరిటీ ఇన్‌చార్జితో కలిసి బట్టలు విప్పించి, ఎండలో కొట్టారని వారు చెబుతున్నారు. అనంతరం తప్పు అతడే చేసినట్లు ఒక లెటర్ కూడా రాయించి పంపించారని పేర్కొంటున్నారు. దీనిపై అనిల్ కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం ఆక్సిజన్ టవర్స్ వద్ద ఆందోళనకు దిగారు. అనిల్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఎంవీపీ స్టేషన్ సీఐ మురళి అక్కడికి చేరుకుని వివరాలు ఆరా తీశారు.